



ఒప్పంద పత్రాలను చూపుతున్న సీఎంఏఎంఎల్ డైరెక్టర్ డి. అర్జునన్, రీనాట్స్ ప్రాజెక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.మనోజ్ పూసప్పన్ - సెంట్రల్ టవర్ భవనం ఊహా చిత్రం

చెన్నై సెంట్రల్ వద్ద 27 అంతస్థుల టవర్



● రూ.349.99 కోట్లతో భవన సముదాయం

టి.నగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ ఎదురుగా 'సెంట్రల్ టవర్' పేరుతో కొత్తగా 27 అంతస్థుల భవనసముదాయం నిర్మించనున్నారు. సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు ధీటుగా ఈ టవర్ కూడా ల్యాండ్ మార్క్‌గా మారనుంది. ఈ భవన నిర్మాణానికి రూ.349.99 కోట్లతో కొత్త ప్రాజెక్టు రూపొందించినట్లు చెన్నై మెట్రో సంస్థ ప్రకటించింది. ఈ పనులను రీనాట్స్ ప్రాజెక్ట్స్ సంస్థకు అప్పగించినట్లు వెల్లడించింది. ఈ మేరకు చెన్నై మెట్రోరైలు సంస్థ, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థ (టిడ్కో) సంయుక్తంగా ఏర్పాటు చేసిన చెన్నై మెట్రో ఆస్తుల నిర్వహణ సంస్థ (చెన్నై మెట్రోరైలు అసెట్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్-సీఎంఏఎంఎల్) ఈ ప్రాజెక్టు అమలు బాధ్యతలను రీనాట్స్ ప్రాజెక్ట్స్ సంస్థకు అప్పగించినట్లు సీఎంఆర్‌ఎల్ అధికారులు తెలిపారు. సీఎంఆర్‌ఎల్ ఛైర్మన్ ఎంఏ సిద్ధిక్ సమక్షంలో సీఎంఏఎంఎల్ డైరెక్టర్ డి.అర్జునన్, రీనాట్స్ ప్రాజెక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. మనోజ్ పూసప్పన్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ప్రాజెక్టు ప్రకారం చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలో 27 అంతస్థుల భవనసముదాయం నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే సెంట్రల్ రైల్వేస్టేషన్ ప్రాంతం ప్రముఖ పర్యాటక ప్రదేశంగా దేశవిదేశాల పర్యాటకులను ఆకట్టుకుంటుదని అధికారులు తెలిపారు. 3.5 ఎకరాల్లో ఈ టవర్‌ను నిర్మించనున్నారు. మొదటి రెండు అంతస్థుల్లో 40 మంది అతిథులు బసచేయడానికి వీలుగా హోటల్ నడుపనున్నారు. 150 మంది అతిథులకు బార్, రెస్టారెంట్ కూడా నిర్మిస్తారు. 250 కార్లు, 170 బైకులు నిలిపేలా విశాలమైన పార్కింగ్ కూడా ఏర్పాటు చేస్తారు. 1 నుండి 4 అంతస్థుల వరకు షాపులు, ఫుడ్‌కోర్టులు, మల్టీప్లెక్స్‌లుంటాయి. 5 నుండి 25 అంతస్థుల వరకు వివిధ కార్యాలయాలకు కేటాయించనున్నారు.26, 27 అంతస్థులలో అతిథులకు గదులు, బార్‌తో కూడిన హోటల్, హాల్స్ ఉంటాయి. ఈ భవనసముదాయ ప్రాంతంలో చెన్నై సెంట్రల్ మెట్రోరైల్వేస్టేషన్, రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆస్పత్రి, పార్క్ రైల్వేస్టేషన్‌లను కలిపేలా పొడవైన సొరంగమార్గాన్ని కూడా నిర్మించనున్నట్లు అధికారులు వివరించారు.



స్టాలిన్‌తో ఉదయనిధి, మంత్రులు, కొత్తగా పార్టీలో చేరిన కార్యకర్తలు

ఆదిలోనే అధికారమా?

పార్టీ ప్రారంభంతోనే పదవిలోకి రావాలనే కలలు ● విజయ్‌పై సీఎం స్టాలిన్ విసుర్లు

చెన్నై, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పార్టీని ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే అధికారంలో రావాలని కలలు కనటం ఫ్యాషనైపోయిందని, అనుభవం, అంగబలం లేనివారంతా ముఖ్యమంత్రి పదవి కోసం ఆరాటపడుతున్నారని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తమిళగ వెట్రి కళగం నేత విజయ్‌పై పరోక్షంగా విమర్శలు చేశారు. తేనాంపేటలోని అన్నా అరివాలయంలో శుక్రవారం నామ్ తమిళర్ కట్చికి చెందిన 8 జిల్లాల కార్యదర్శులు సహా 2 వేల మంది, ఇతర పార్టీలకు చెందిన మరో వెయ్యి మంది మొత్తం 3 వేల మంది సీఎం సమక్షంలో డీఎంకేలో చేరారు. ఆ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ డీఎంకే చరిత్ర తెలియని వారంతా పసలేని విమర్శలు చేస్తున్నారని, 1949లో మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై ప్రారంభించిన డీఎంకే అంచలంచెలుగా ఎదిగి, అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. డీఎంకేని సర్వనాశనం చేస్తామంటూ ప్రగల్భాలు పలికినవారంతా ప్రస్తుతం పత్తాలేకుండా పోయారన్నారు. 75 యేళ్లకు పైగా ప్రజలకు సేవలు చేస్తున్న డీఎంకే సుస్థిరంగా నిలిచి ఉంటుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొత్తగా రాజకీయాల్లోకి వచ్చేవారంతా కాబోయే ముఖ్యమంత్రి తానేనని గొప్పలు చెప్పుకోవడం చూస్తుంటే హాస్యాస్పదంగా ఉందనానరు. ప్రజలకు సాయం చేయకుండా పార్టీని ప్రారంభించినవెంటనే అధికారంలోకి రావాలని ఆశపడుతుండటం గర్హనీయమన్నారు. ద్రావిడ తరహా పాలన అంటేనే కొందరికి మంటపుడుతోందని, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని, ప్రత్యర్థులు ఎంత ఆగ్రహం ప్రకటిస్తారో అంత కంటే ఎక్కువగా ద్రావిడ తరహా పాలన అంటూ గట్టిగా నినాదాలు చేస్తూనే ఉంటామని, ఎవరికీ భయపడే ప్రసక్తే లేదన్నారు. నామ్‌తమిళర్ కట్చి, ఇతర పార్టీలకు చెందినవారంతా డీఎంకేలో చేరటానికి కారణం వారికి సరైన నాయకత్వం లేకపోవడమేనని స్టాలిన్ చెప్పారు. పార్టీ పేరులోనే తమిళం అనే పదం పెట్టుకున్న నాయకుడు (సీమాన్) గురించి కూడా తాను ఎలాంటి విమర్శలు చేయడానికి ఇష్టపడటం లేదన్నారు.

● గవర్నర్ విమర్శలే మా పార్టీకి ప్రచారం

రాష్ట్ర గవర్నర్ ఆర్ ఎన్ రవి మతతత్త్వాన్ని చంకనబెట్టుకుని డీఎంకే పాలనపై విమర్శలు చేస్తున్నారని, పాలనా వ్యవహారాల్లో అనవసరంగా జోక్యం చేసుకున్నా, శాసనసభ నుంచి వాకౌట్ చేసినా తాము పెద్దగా పట్టించుకోలేదన్నారు. సుదీర్ఘచరిత్ర కలిగిన శాసనసభకు కళంకం తెచ్చేలా గవర్నర్ ప్రవర్తించినా ఆయనను రీకాల్ చేయాలని సభలో తీర్మానం చేయలేదనే విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలని స్టాలిన్ చెప్పారు. వచ్చే యేడాది కూడా శాసనసభకు గవర్నర్ రావాలని, వచ్చి ఎప్పటిలానే ప్రసంగించకుండానే వెళ్ళాలని కోరుకుంటున్నానని, గవర్నర్ ఇలా ప్రవర్తించడం వల్ల డీఎంకే ప్రభుత్వానికి విస్తృత ప్రచారం వస్తోందని, దీని వల్ల ఆయనను మార్చకూడదని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు స్టాలిన్ వ్యంగ్యంగా అన్నారు. డీఎంకేకి తీవ్ర ప్రచారం ఇస్తున్న గవర్నర్‌ను ఎట్టి పరిస్థితులలోనూ మార్చకూడదని ప్రధాని మోదీకి, హోంమంత్రి అమిత్‌షాకు విజ్ఞప్తిచేస్తున్నట్లు సభికుల హర్షధ్వానాల మధ్య పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి దురైమురుగన్, మంత్రి అన్బిల్ మహేష్, డీఎంకే ప్రచారకమిటీ అధ్యక్షుడు టీకేఎస్ ఇళంగోవన్, పార్టీ జిల్లా శాఖ కార్యదర్శి సిట్రరసు తదితరులు పాల్గొన్నారు.

31న నగరానికి అమిత్‌షా



చెన్నై, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఈ నెల 31న నగరానికి రానున్నారు. మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడి మనవరాలి వివాహ రిసెప్షన్‌కు హాజరుకానున్నారు. ఈస్ట్‌కోస్ట్‌రోడ్డులోని సముద్రా హాలులో జరిగే ఈ వేడుకలకు అమిత్‌షాతో పాటు బీజేపీ సీనియర్ నేతలు, ముఖ్యమంత్రి స్టాలిన్, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు కూడా పాల్గొంటారు. కాగా అదే రోజు అమిత్‌షా రాష్ట్ర బీజేపీ నేతలతో భేటీ కానున్నట్లు సమాచారం. బీజేపీ రాష్ట్ర శాఖలో ప్రస్తుతం జిల్లా శాఖ నేతల నియామకాలు జరుగుతున్నాయి. ఇప్పటికే 33 జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించారు. మరో 20 జిల్లాలకు సంబంధించిన అధ్యక్షుల జాబితా కూడా విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక కూడా జరుగనుంది. ఆ ఎన్నికల పర్యవేక్షకుడిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వచ్చేవారం నగరానికి రానున్నారు.

శ్రీవారి సేవలో మద్రాసు హైకోర్టు సీజే



ఆలయం ముందు జస్టిస్ కె.ఆర్. శ్రీరామ్

తిరుమల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీరామ్ కల్పతి రాజేంద్రన్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున ఆలయంలోకి వెళ్లిన ఆయన అభిషేకం సేవలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపంలో ఆయనకు వేద పండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

● ఈరోడ్ ఈస్ట్ ఉప ఎన్నిక...

1194 మంది సిబ్బంది నియామకం

టి.నగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల నిర్వహణకు 1194మంది సిబ్బందిని నియమిం చారు. ఆ నియోజకవర్గ ఉప ఎన్నిక ఫిబ్రవరి 5న జరుగనున్న విషయం తెలిసిందే. ఎన్నికలకు ఇక 12 రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో పోలింగ్ నిర్వహణ పనులు చురుకుగా సాగుతున్నాయి. నియోజకవర్గంలో 237 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఎన్నికల సిబ్బందికి ఈరోడ్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజగోపాల్ సుంకర ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నారు. ఈ నెల 27న ఈరోడ్ రంగంపాళయం ఆర్‌ఏఎన్‌ఎం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి రెండో విడత శిక్షణా కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నారు.



సమావేశ మందిరంలోకి వెళ్తున్న విజయ్

విజయ్‌తో జిల్లా నేతల భేటీ

● స్థానికంగా బలోపేతంపై సుదీర్ఘ చర్చ

అడయార్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): 'తమిళగ వెట్రి కళగం' అధ్యక్షుడు, నటుడు విజయ్ టీవీకే పార్టీని సంస్థాగతంగా క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే అంశంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా, ఆయన శుక్రవారం పార్టీ ప్రధాన కార్యాలయంలో జిల్లాల ముఖ్య నిర్వాహకులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ముఖ్యంగా, పార్టీలో అన్నీ తానై వ్యవహరిస్తున్న ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్‌ను సైతం సమావేశ మందిరం నుంచి బయటకు పంపించి ముఖ్య నిర్వాహకులతో చర్చించడం గమనార్హం. వచ్చే నెల 2వ తేదీ టీవీకే ద్వితీయ వార్షికోత్సవం జరుపుకోనుంది. దీంతో పార్టీ వ్యవస్థాపక వేడుకలను ఘనంగా నిర్వహించాలని విజయ్ భావిస్తున్నారు. మరోవైపు 2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ఆయన అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై ఆయన దృష్టి సారించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న పరందూరులో రైతులు, ఆందోళనకారులతో ఆయన సమావేశమై, వారి సమస్యలను తెలుసుకున్నారు. అంతేకాకుండా, తన క్షేత్రస్థాయి పర్యటనలు ఇక్కడ నుంచే ప్రారంభిస్తున్నట్టు విజయ్ ప్రకటించారు. శుక్రవారం కూడా అరియలూరు, కడలూరు, కోయంబత్తూరు, ఈరోడ్ సహా 20 జిల్లాలకు కార్యదర్శులను నియమించారు. మరోవైపు, పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ కూడా 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహిస్తూ, పార్టీ అభివృద్ధి, సభ్యత్వంపై సమీక్షలు చేస్తున్నారు. ఇందులోభాగంగా, శుక్రవారం పనయూరులోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బుస్సీ ఆనంద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వంద మందికిపైగా ముఖ్య నిర్వాహకులు పాల్గొన్నారు. కొద్దిసేపటి తర్వాత ఈ సమావేశానికి వచ్చిన విజయ్ ప్రధాన కార్యదర్శి, కోశాధికారిని సమావేశమందిరం నుంచి బయటకు పంపించి, జిల్లా నిర్వాహకుల్లో ఒక్కొక్కరితో ప్రత్యేకంగా సమావేశం కావడం చర్చనీయాంశంగా మారింది. ఇదిలావుంటే ఈ నెల 26వ తేదీ జరుగనున్న భారత గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఇచ్చే తేనీటి విందుకు టీవీకే అధ్యక్షుడు విజయ్‌ని ఆహ్వానించారు. అయితే తేనీటి విందుకు ఆయన హాజరవుతారా లేదా అన్నది తేలాల్సివుంది.



సమావేశానికి వస్తున్న జిల్లా కార్యదర్శులు

నాగపట్టినంలో అర్ధరాత్రి కేంద్ర బృందం పరిశీలన



● ధాన్యం నమూనా సేకరణ

చెన్నై, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా డెల్టా జిల్లాల్లో పర్యటిస్తున్న కేంద్ర బృందం సభ్యులు నవీన్, ప్రీతి, రాహుల్, అభిషేక్ పాండే ఇతర అధికారులు నాగపట్టినం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో గురువారం రాత్రి కూడా పర్యటించి ఆయా ప్రాంతాల్లోని ధాన్యంలో తేమ శాతాన్ని లెక్కగట్టారు. మనక్కుడి, సియాతమంగై, పట్టమంగళం, తేవూరు తదితర ప్రాంతంల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం నిల్వలను కూడా పరిశీలించారు. వీరితోపాటు రాష్ట్ర వినియోగవస్తువుల వాణిజ్య సంస్థ సంచాలకులు అన్నాదురై, కలెక్టర్ ఆకాష్ తదితరులున్నారు.



కడలూరు జిల్లా కాట్టుమన్నార్‌కోవిల్ వద్ద ధాన్యాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

కాట్టుమన్నార్‌కోవిల్‌లో...

తంజావూరు, తిరువారూరు, మైలాడుదురై, నాగపట్టినం జిల్లాల్లో పర్యటన ముగించుకున్న కేంద్ర బృందం శుక్రవారం ఉదయం కడలూరు జిల్లాలో రెండోవిడత పర్యటన ప్రారంభించారు. ఆ జిల్లాలోని కాట్టుమన్నార్‌కోవిల్ ప్రాంతంలో వానకు తడిసి నేలవాలిన వరిపైరు పరిశీలించారు.ఆయా ప్రాంతాల రైతులు కేంద్ర బృందం సభ్యులను కలుసుకుని తడిసిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసేలా ఉత్తర్వులిప్పించి, తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో కేంద్రానికి నివేదిక పంపి 17 శాతం కంటే తేమ అధికంగా ఉన్న వరిధాన్యాన్ని ప్రభుత్వమే కొనేలా సిఫారసు చేస్తామని కేంద్ర బృందం భరోసా ఇచ్చింది.

జగబర్ అలి హత్య విచారణలో పోలీసుల నిర్లక్ష్యం

డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత

ప్యారీస్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అక్రమ క్వారీల గురించి పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘసేవకుడు జగబర్ అలి హత్య కేసు విచారణలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత ఆరోపించారు. జగబర్ అలి హత్యను ఖండిస్తూ పుదుకోటలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో శుక్రవారం ఉదయం నిర్వహించిన మహా ధర్నాలో ప్రేమలత పాల్గొన్నారు. పుదుకోట జిల్లాలో ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న 686 రాళ్ల క్వారీల్లో రోజుకు లక్ష టన్నులకు పైగా దోపిడీ జరుగుతోందని, దీనిపై జగబర్ అలి జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు, పోలీసులకు పలుమార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని సమాచారం. ద్రావిడ మోడల్ ప్రభుత్వంలో రెండేళ్లుగా ఈ దోపిడీ కొనసాగుతోందని, దీనిని నిలదీసినందుకే క్వారీల నిర్వాహకులు జగబర్ అలిని లారీతో తొక్కించి హత్య చేశారని ఆరోపించారు. మైనార్టీ వర్గానికి చెందిన జగబర్ అలీని పోగొట్టుకున్న కుటుంబానికి డీఎంకే ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ముస్లిం సోదరులు బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఐక్యతగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని ప్రేమలత సూచించారు.



పుదుకోటలో జరిగిన ధర్నాలో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న ప్రేమలత

సమాచార దర్శిని

27 నుంచి చదురగిరికి భక్తుల అనుమతి

పెరంబూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తై అమావాస్య సందర్భంగా, చదురగిరి సుందర మహాలింగం దర్శనం కోసం ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు నాలుగు రోజులు భక్తులను అనుమతించనున్నారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మాత్రమే భక్తులను అనుమతించనున్నారు. భక్తుల సౌకర్యార్థం మదురై, శ్రీవిల్లిపుత్తూర్, రాజపాళయం, విరుదునగర్, తేని, టి.కల్లుపట్టి తదితర ప్రాంతాల నుంచి చదురగిరి ప్రత్యేక బస్సులు నడుపనున్నారు.కొండ మార్గంలో భక్తులకు ఆహారం, నీరు అందజేసేలా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రూ.3 కోట్లతో తిరుచ్చిలో జల్లికట్టు స్టేడియం

పెరంబూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా సూరియూరులో రూ.3 కోట్లతో శాశ్వత జల్లికట్టు స్టేడియం నిర్మాణానికి రాష్ట్ర క్రీడాభివృద్ధి కమిషన్ టెండర్లు ఆహ్వానించింది. సూరియూరులో ప్రతి ఏడాది పొంగల్ సందర్భంగా జల్లికట్టు నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో, సూరియూరులో రూ.3 కోట్లతో జల్లికట్టు, ఇతర క్రీడలు నిర్వహించేలా స్టేడియం నిర్మించనున్నారు. స్టేడియం నిర్మాణానికి ఆసక్తి చూపే సంస్థలు ఫిబ్రవరి 4వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, టెండరు పొందిన సంస్థ 270 రోజుల్లో స్టేడియం నిర్మాణం పూర్తి చేయాలని అధికారులు తెలిపారు.

చెస్ పోటీలకు ఆహ్వానం

పెరంబూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ చెస్ ఛాంపియన్ గుకేష్‌ను అభినందించేలా ఆదివారం చెస్ పోటీలు నిర్వహించనున్నారు. మాడంబాక్కంలోని వేలమ్మాళ్ విద్యాలయ పాఠశాల ప్రాంగణంలో 7,9,11,13,15 ఏళ్ల లోపు విభాగాల్లో వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నారు. మొత్తం ఏడు రౌండ్లు జరిగే ఈ పోటీలు 'స్విస్' ప్రాతిపదికన 'ఫిడే' నిబంధనలతో జరుగనున్నాయి. ప్రతి విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన బాల బాలికలకు సైకిల్ బహుమతిగా అందజేయనున్నారు. చెన్నై సహా అన్ని జిల్లాల బాల బాలికలు పాల్గొనవచ్చు. ఆసక్తి కలిగిన వారు 8610292372, 9994213268 అనే నెంబర్లు సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

మ్యాచ్ టిక్కెట్టు ఉంటే ఎంటీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

● నేటి వరకు అవకాశం

పెరంబూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో నడుపుతున్న ఎంటీసీ బస్సుల్లో క్రికెట్ అభిమానులు ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. చేపాక్కం చిదంబరం స్టేడియంలో శనివారం భారత్-ఇంగ్లాండ్ మధ్య రెండవ టి20 మ్యాచ్ జరుగనుంది. ఈ మ్యాచ్ చూసేందుకు అభిమానులు పెద్దసంఖ్యలో తరలిరానున్నారు. ఈ మ్యాచ్‌కు టిక్కెట్లు కొనుగోలు చేసిన అభిమానులు, దానిని కండక్టర్ చూపించి ఏసీ బస్సులు మినహా డీలక్స్, ఎక్స్‌ప్రెస్, సాధారణ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని ఎంటీసీ తెలిపింది. కాగా, క్రికెట్ అభిమానుల సౌకర్యార్థం అర్ధరాత్రి 12 గంటల వరకు మెట్రోరైళ్లు నడుపనున్నట్లు సీఎంఆర్ఎల్ తెలిపింది.

రూ.10 కోట్లతో 39 మహిళా వ్యాయామశాలలు

పెరంబూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 39 ప్రాంతాల్లో మహిళా వ్యాయామశాలలు ఏర్పాటుచేయనున్నట్లు జీసీసీ తెలిపింది. ఈ మేరకు జీసీసీ విడుదల చేసిన ప్రకటనలో... నగరంలో మహిళల ఆరోగ్యం సంరక్షించే చర్యల్లో భాగంగా వ్యాయామశాలలు ఏర్పాటు చేయనున్నట్లు జీసీసీ బడ్జెట్ సమావేశాల్లో మేయర్ ప్రియ ప్రకటించారని తెలిపింది. ఆ ప్రకారం, నగరంలో 39 ప్రాంతాల్లో రూ.9.97 కోట్లతో వ్యాయామశాలలు కానున్నాయి. ప్రస్తుతం 22 వ్యాయామశాలల పనులు ప్రారంభం కాగా, మరో నాలుగు నిర్మాణాలు త్వరలో ప్రారంభించనున్నామన్నారు. మిగిలిన 11 వ్యాయామశాలల నిర్మాణాలు కూడా త్వరలో ప్రారంభిస్తామని జీసీసీ తెలియజేసింది.

స్కాన్ చేస్తే ఏబీసీడీ రెయిమ్స్

అడయార్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రాష్ట్ర ప్రభుత్వం, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో చిన్నారుల్లో చదువుపై ఆశక్తి కలిగేలా కరువాడికుప్పం ఈసీఆర్ రహదారిలో ఒక ప్రదర్శన ఏర్పాటుచేసింది. ఇందులో నిత్యం మొబైల్ ఫోన్‌తో ఉండే చిన్నారులకు ఆ సెల్‌ఫోన్‌ల ద్వారానే ఏబీసీడీ రెయిమ్స్ పలికేలా వినూత్న టెక్నాలజీతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. తమ వద్ద ఉన్న మొబైల్ ఫోన్లతో స్కాన్ చేస్తే రెయిమ్స్ పాట రూపంలో వినిపిస్తుంది. ఈ నెల 28వ తేదీ వరకు జరిగే ఈ ప్రదర్శనలో మొత్తం 60కు పైగా స్టాల్స్ ఏర్పాటు చేసి, పుస్తకాలు వివిధ రకాల క్రీడా పరికరాలను ప్రదర్శనకు ఉంచారు. అలాగే, ఈ ప్రదర్శనలోని ఫోటోలు నలుపు రంగులో ఉన్నప్పటికీ వాటిని మొబైల్‌లో స్కాన్ చేయగానే రంగుల్లో కనిపిస్తున్నాయి. ఈ ప్రదర్శనను చిన్నారులు అమితంగా ఎంజాయ్ చేస్తూ చూస్తున్నారు.

రవాణా శాఖకు రూ.237 కోట్ల ఆదాయం

పెరంబూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా నడిపిన ప్రత్యేక బస్సుల ద్వారా రాష్ట్ర రవాణా శాఖకు రూ.237 కోట్లు ఆదాయం లభించిందని ఆ శాఖ మంత్రి శివశంకర్ తెలిపారు. ఈ మేరకు రవాణా శాఖ విడుదల చేసిన ప్రకటనలో... సంక్రాంతి సందర్భంగా ఈ నెల 10 నుంచి 19వ తేది వరకు 1.87 లక్షల బస్సు సర్వీసులు నడిపామన్నారు. గత ఏడాదితో పోల్చితే 37,832 సర్వీసలు అదనంగా నడిపామన్నారు. ఈ బస్సు సర్వీసుల ద్వారా రవాణా శాఖకు రూ.237.47 కోట్ల ఆదాయం సమకూరిందని మంత్రి తెలిపారు.

చేపాక్‌లో క్రికెటర్ల ప్రాక్టీస్


బ్యాటింగ్ ప్రాక్టీస్‌కి వెళ్తున్న భారత్ ఆటగాడు తిలక్‌వర్మ



స్టేడియంలో భారత్, ఇంగ్లాండ్ క్రీడాకారులు

టీ20 మ్యాచ్ కోసం చెన్నై చేరుకున్న భారత, ఇంగ్లాండ్ క్రికెట్ జట్లు శుక్రవారం చేపాక్ స్టేడియంలో ముమ్మరంగా సాధన ప్రారంభించారు.


భారత్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్

కోవై అన్నాడీఎంకే సభలో కుర్చీలతో పరుగులు తీసిన జనం

చెన్నై, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు సమీపం సింగానల్లూరు నియోజకవర్గం పరిధిలో పీలమేడు రెట్టికడై మైదానంలో గురువారం రాత్రి అన్నాడీఎంకే ఆధ్వర్యంలో జరిగిన ఎంజీఆర్ జయంతి సభలో కార్యకర్తలు, మహిళలు తాము కూర్చున్న కుర్చీలను ఇళ్ళకు తీసుకెళ్ళారు. ఎంజీఆర్ జయంతి సందర్భంగా నిరుపేదలకు సహాయకాలు పంపిణీ చేశారు. పార్టీ ఎమ్మెల్యే అమ్మన్ అర్జునన్, కేఆర్ జయరామ్, సినీ దర్శకుడు ఆర్వీ ఉదయకుమార్, అనుమోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సభలో పార్టీ శ్రేణులు, మహిళలు కూర్చునేందుకు వెయ్యికిపైగా కొత్త కుర్చీలను తెప్పించారు. సింగానల్లూరు ఎమ్మెల్యే కేఆర్ జయరామ్ తన ప్రసంగాన్ని ముగిస్తూ సభకు హాజరైన కార్యకర్తలు, మహిళలు వారు కుర్చున్న కుర్చీలను ఇళ్ళకు తీసుకువెళ్లొచ్చని, సభికులకు ఆ కుర్చీలను తాను కానుకగా అందిస్తున్నానని ప్రకటించారు. మరుక్షణమే అందరూ తాము కూర్చున్న ప్లాస్టిక్ కుర్చీలను ఇళ్ళకు పట్టుకెళ్ళారు. ఒకే సమయంలో కుర్చీలతో పార్టీ కార్యకర్తలు మైదానం నుండి వెలుపలకు పరుగెత్తడటంతో కాసేపు తొక్కిసలాట కూడా జరిగింది. ఏది ఏమైనప్పటికీ సభకు హాజరైన జనమంతా అన్నాడీఎంకే ఎమ్మెల్యే జయరామ్‌కు జేజేలు పలుకుతూ కొత్త ప్లాస్టిక్ కుర్చీలతో సంతోషంగా ఇళ్ళకు చేరుకున్నారు.


సభ ముగియగానే కుర్చీలను తీసుకెళ్తున్న మహిళలు

చట్టాలపై విద్యార్థులకు అవగాహన


సదస్సులో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించే కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ సుబ్బులక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లత, తమిళనాడు కళాశాలల డైరెక్టర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోట మసీదు పరిశీలించిన ఎస్డీపీఐ నేతలు

వేలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోట మసీదును ఎస్డీపీఐ నాయకులు పరిశీలించారు. కోట ఆలయానికి వచ్చి పూజలు చేస్తున్న నేపథ్యంలో, కోట ప్రాంగణంలో ఉన్న మసీదుకు ఎవరూ వెళ్లకుండా బ్యారికేడ్లు ఏర్పాటుచేశారు.. అలాగే, ఈ ప్రాంతం ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ఈ నేపథ్యంలో, ఎస్డీపీఐ నేతలు శుక్రవారం మసీదు ప్రాంతాన్ని పరిశీలించారు. మసీదులో ముస్లింలు ప్రార్థనలు చేసుకొనేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.


కోట మసీదును పరిశీలిస్తున్న ఎస్డీపీఐ నేతలు

సెంట్రల్-తిరువళ్లూర్ మార్గంలో సబర్బన్ రైళ్ల సేవలకు అంతరాయం

పెరంబూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సిగ్నల్ వ్యవస్థలో తలెత్తిన సాంకేతికలోపం కారణంగా చెన్నై సెంట్రల్-తిరువళ్లూర్ మార్గంలో శుక్రవారం ఉదయం సబర్బన్ రైళ్ల సేవలకు అంతరాయం కలిగింది. సెంట్రల్ నుంచి పెరంబూర్ మార్గంగా ఆవడి, తిరువళ్లూర్ వరకు నడిపే సబర్బన్ రైళ్లు టైంటేబుల్ ప్రకారం కాకుండా 20 నుంచి 30 నిమిషాలు ఆలస్యంగా నడిచాయి. ఉదయం కావడంతో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. సాంకేతిక లోపం సరిచేయడంతో మూడు గంటల అనంతరం యథావిధిగా రైళ్ల సేవలు కొనసాగాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు


పెరంబూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా టైడల్ పార్క్, గిండి ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

టైడల్ పార్క్: తరమణి పార్క్, కానగం, పెరియార్ నగర్, తిరువాన్మియూర్, ఇందిరా నగర్ కొంత భాగం, ఎంజీఆర్ నగర్ (ఎస్సార్పీ టూల్స్, కానగం), వేళచ్చేరి కొంత భాగం, వీఎస్ఐ ఎస్టేట్ ఫేస్-1, వందడుగుల రోడ్డు కొంత భాగం, అన్నా నగర్, సీఎస్ఐఆర్ రోడ్డు, ఆర్ఎంజడ్ మిలానియమ్, (కందన్‌చావిడి), సీపీటీ కొంత భాగం, ఆక్సెందాస్, టైడల్ పార్క్, గాంధీ నగర్, అడయార్ కొంత భాగం

గిండి: గిండి ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఈకాట్టుతాంగళ్, గాంధీ నగర్, పూందమల్లి రోడ్డు, జీఎస్ రోడ్డు, అంబాళ్ నగర్, లేబర్ కాలని అన్ని వీధులు, పిళ్లయార్ ఆలయం 1 నుంచి 5 వీధులు, ఏ,బీ,సీ,డీ బ్లాక్‌లు, పూమగళ్ వీధి, సౌత్ ఫేస్, మౌంట్ రోడ్డు కొంత భాగం, బాలాజి నగర్, భారతియార్ వీధి, ధనకోటి రాజా వీధి, అచ్యుతమ్ నగర్, మునుస్వామి వీధి.

తొక్కిసలాటలో మృతురాలి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం

తిరుమల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వైకుంఠద్వార దర్శన టోకెన్ల జారీ సమయంలో జరిగిన తొక్కిసలాట ఘటనలో మృతిచెందిన తమిళనాడు రాష్ట్రం సేలంకు చెందిన మల్లిక కుటుంబానికి రూ.25 లక్షల పరిహారాన్ని టీటీడీ బోర్డు సభ్యులు శుక్రవారం అందజేశారు. పరిహారం చెక్‌ను మల్లిక కుమారుడు రమేష్‌కు టీటీడీ సభ్యులు నరేష్‌కుమార్, రామ్మూర్తి, శాంతారాం, కృష్ణమూర్తి అందజేశారు. బాధితుల కుటుంబంలో ఒకరికి టీటీడీలో కాంట్రాక్ట్ ఉద్యోగం ఇచ్చేందుకు వారి కుటుంబ సభ్యుల వివరాలను బోర్డు సభ్యుల బృందం తీసుకుంది.


చెక్కు అందజేస్తున్న టీటీడీ బోర్డు సభ్యులు

వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరా

● మంత్రి సెంథిల్ బాలాజి

పెరంబూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు చేపట్టినట్లు విద్యుత్ శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ తెలిపారు. విద్యుత్ భవన్‌లో శుక్రవారం వేసవిలో విద్యుత్ సరఫరాపై సమీక్ష జరిగింది. ఈ సమావేశం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... గత వేసవిలో విద్యుత్ వినియోగం 20 వేల మెగావాట్లుగా నమోదైందని, ఈ ఏడాది 22 వేల మెగావాట్లకు చేరుకొనే అవకాశముందని భావిస్తున్నామన్నారు. పెరిగిన విద్యుత్‌కు అనుగుణంగా నిరంతరాయ సరఫరాకు చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించామన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు సంబంధించిన త్వరలో కొత్త టెండర్లు విడుదల చేయనున్నామన్నారు. స్మార్ట్ మీటర్లు అమర్చిన తర్వాత విద్యుత్ రీడింగ్ విధానం అమలుచేయనున్నట్లు మంత్రి తెలిపారు.

'సీఎం ఫార్మశీ' నిర్వహణకు తలా రూ.1.50 లక్షల సబ్సిడీ

పెరంబూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): 'సీఎం ఫార్మశీ' దుకాణాలు నడిపేందుకు ఎంపిక చేసిన వారికి, తొలివిడతగా తలా రూ.1.50 లక్షల ప్రభుత్వ సబ్సిడీ విడుదల చేసినట్లు సహకార సంఘాల రిజిస్ట్రార్ సుబ్బయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... ప్రజలకు తక్కువ ధరకు జనరిక్, ఇతర మందులు లభించేలా 'ముఖ్యమంత్రి మెడికల్' దుకాణాలను వెయ్యి ప్రాంతాల్లో ఏర్పాటుచేయనున్నామన్నారు. దుకాణాల ఏర్పాటుకు సహకార సంఘాల ద్వారా 490, వ్యాపారుల ద్వారా 638 మొత్తం 1,128 దరఖాస్తులు అందాయని తెలిపారు. ఎంపిక చేసిన వారికి, తొలివిడతగా ప్రభుత్వ సబ్సిడీగా తలా రూ.150 లక్షలు విడుదల చేసినట్లు తెలిపారు. దుకాణాల నిర్వహణ, మందుల విక్రయాలు తదితరాలపై ఎంపికైన వారికి శిక్షణ ఇవ్వనున్నామని, త్వరలో ఈ మందుల దుకాణాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు.

సెవ్వాపేట రైల్వేస్టేషన్‌లో సదుపాయాలు

● సంప్రదింపుల కమిటీ సమావేశంలో వినతి

తిరుత్తణి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా సెవ్వాపేట రైల్వేస్టేషన్‌లో తాగునీరు, మరుగుదొడ్లు సహా ప్రాథమిక సదుపాయాలను వెంటనే కల్పించాలని సంప్రదింపుల కమిటీ సభ్యులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సెవ్వాపేట రైల్వేస్టేషన్ సంప్రదింపుల కమిటీ సమావేశం జరిగింది. స్టేషన్ అధికారి దివాకర్, దాస్ విక్టర్ రాజ్, జూనియర్ ఇంజనీర్ గజేంద్రన్, సలహా కమిటీ సభ్యులు కోనేటి వెంకటేశ్వర్లు, రమణి, రిషికేశ్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు శ్రీనివాసన్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు స్టేషన్ అధికారికి పలు విజ్ఞప్తులు చేశారు. రైల్వే ఓవర్ పాస్ పనులు నిలిచిపోవడంతో ప్రజా రవాణా కోసం సొరంగం నిర్మించాలని, సెవ్వాపేట రైల్వేస్టేషన్‌లో తాగునీరు, మరుగుదొడ్లు సహా ప్రాథమిక వసతులు కల్పించాలని కోరారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులకి తీసుకురావాలని కోరారు.


సమావేశంలో కమిటీ సభ్యులు, అధికారులు

రెట్టింపు డబ్బు పేరుతో ఘరానా మోసం

రూ.12 కోట్ల నగదు, 2.5 కేజీల బంగారం స్వాధీనం

● బీజేపీ మహిళా నేత సహా ముగ్గురి అరెస్టు

అడయార్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సేలంలో ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. తమ దగ్గర డిపాజిట్ చేస్తే రెట్టింపు మొత్తంలో డబ్బులు చెల్లిస్తామని నమ్మించి, కొందరు రూ.500 కోట్ల మేరకు వసూలు చేశారు. దీనికి సంబంధించి బీజేపీ మహిళా నాయకురాలి సహా ముగ్గురిని అరెస్టు చేశారు. పోలీసుల తనిఖీల్లో రూ.12 కోట్లతో పాటు 2.5 కేజీల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఈ మోసం వివరాలను పరిశీలిస్తే... సేలం, అమ్మాపేట ఆత్తూరు మెయిన్ రోడ్డులోని ఓ కల్యాణమండపంలో సెయింట్ అన్నా థెరిస్సా పేరుతో చారిటబుల్ ట్రస్టును అదే ప్రాంతానికి చెందిన బీజేపీ మహిళా నాయకురాలు విజయభాను నడుపుతున్నారు. తమ ట్రస్టులో డబ్బు డిపాజిట్ చేస్తే రెట్టింపు మొత్తంలో ఇస్తామని ప్రచారం చేశారు. రూ.లక్ష డిపాజిట్ చేస్తే 9 నెలలకు ప్రతినెలా రూ.30 వేలు ఇస్తామంటూ నమ్మించారు. దీంతో అనేక మంది భారీ మొత్తంలో డిపాజిట్ చేశారు. ఈ విషయం జిల్లా ఆర్థిక నేరాల విభాగం పోలీసుల దృష్టికి వెళ్లడంతో వారు విచారణ జరుపగా, అనుమతి లేకుండా, అక్రమంగా వసూలు చేసినట్టు తేలింది. డిపాజిటర్లు కూడా జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత చారిటబుల్ ట్రస్ట్‌లో తనిఖీలకు వెళ్ళిన పోలీసులపై నిర్వాహకులు దాడి చేశారు. ఈ విషయాన్ని సేలం నగర పోలీస్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్ళారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన కమిషనర్.. డీసీపీలు వేల్ మురుగన్, గీత సారథ్యంలో వంద మంది పోలీసులను పంపించి, కల్యాణమండపంలో తనిఖీలు చేశారు. ఆ సమయంలో అక్కడ ఉన్న విజయభాను, జయప్రద, భాస్కర్ అనే వారిని అదుపులోకి తీసుకుని విచారించగా మోసం చేసి డిపాజిట్లు వసూలు చేసినట్టు తేలింది. దీంతో ఆ ముగ్గురిని అరెస్టు చేశారు. అంతేకాకుండా, ట్రస్టులో ఉన్న రూ.12 కోట్ల నగదు, 2.5 కేజీల బంగారం, 10 కేజీల వెండి, 200 బస్తాల బియ్యం, 200 బస్తాలకుపైగా కిరాణా సరకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మోసానికి సంబంధించి మొత్తం 15 మందిపై కేసులు నమోదు చేశారు. వీరంతా కలిసి సుమారుగా రూ.500 కోట్ల మేర వసూలు చేసినట్టు పోలీసులు ప్రాథమికంగా చెబుతున్నారు. ఇదిలావుంటే అరెస్టు చేసిన ముగ్గురిని శుక్రవారం కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

బస్సు ఛార్జీల పెంపుపై నాలుగు నెలల్లో నిర్ణయం

● రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఉత్తర్వులు

పెరంబూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బస్సు ఛార్జీల పెంపుపై నాలుగు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. డీజిల్ ధరలకనుగుణంగా బస్సు ఛార్జీలు పెంచేలా ఉత్తర్వులు జారీచేయాలని కోరుతూ ఆమ్నీ బస్సుల యజమానుల సంఘం తరఫున మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ గురువారం విచారణకు రాగా, ఛార్జీల నిర్ణయంపై హైకోర్టు ఆదేశాలకనుగుణంగా రవాణా శాఖ కార్యదర్శి నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటుచేసినట్లు ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. ప్రభుత్వ వివరణ అనంతరం, ఛార్జీల పెంపుపై నాలుగు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని రవాణా శాఖ కార్యదర్శి నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీకి మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

'మీనంబాక్కం'లో 'క్వీన్ ఆఫ్ ది స్కైస్'

అడయార్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): 'క్వీన్ ఆఫ్ ది స్కైస్'గా పేరొందిన జోర్డాన్ దేశానికి చెందిన అతిపెద్ద కార్గో విమానం చెన్నై విమానాశ్రయంలో దిగింది. చెన్నైలో సరకులను అన్‌లోడింగ్ చేసిన తర్వాత దుబాయ్ మీదుగా అరబ్ ఎమిరేట్స్‌కు వెళ్ళిపోయింది. అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న నేషనల్ ఎయిర్‌లైన్స్‌కు అతిపెద్ద కార్గో ఫ్లైట్ 747-400 విమానం.. రెండు రోజుల క్రితం జోర్డాన్ దేశంలోని అంబాన్ ఎయిర్‌పోర్టు నుంచి సరకులతో బయలుదేరింది. ఈ కార్గో విమానాన్ని 'క్వీన్ ఆఫ్ ది స్కైస్'గా పిలుస్తారు. ఈ విమానం చెన్నైకు శుక్రవారం చేరుకుంది. మొత్తం 125 టన్నుల బరువు ఒకేసారి మోసుకెళ్ళగలిగే ఈ భారీ కార్గో విమానం.. చెన్నైలో సరకులను దించి ఆ తర్వాత యూఏఈకి వెళ్ళింది. ఈ భారీ కార్గో విమానం చెన్నై నగరానికి రావడం చెన్నై విమానాశ్రయానికి మరింత గౌరవం పెంచిందని ఎయిర్‌పోర్టు అధికారులు అభిప్రాయపడ్డారు.



చెన్నై ఎయిర్‌పోర్టులో 'క్వీన్ ఆఫ్ ది స్కైస్' కార్గో ఫ్లైట్

టామ్స్ నేతకు మాతృవియోగం

ప్యారీస్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): 'తమిళనాడు ఆదిఆంధ్ర అరుంధతీయ మహాసభ (టామ్స్) వ్యవస్థాపకులు, జనోదయం డైరెక్టర్ గొల్లపల్లి ఇశ్రాయేలు మాతృమూర్తి గొల్లపల్లి చంద్రమ్మ (84) వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా గురువారం కీల్పాక్కం సమీపంలోని టీపీ సత్రం వీఎస్ఎన్ పురం ఇంట్లో మృతిచెందారు. ప్రజల సందర్శనార్థం వీఎస్ఎన్ పురంలో ఉంచిన ఆమె భౌతికకాయానికి పుర ప్రముఖులు అంజలి ఘటించారు. రెవ.డా.ఎస్.ప్రకాష్‌రాజ్, బిషప్ డా.దేవదాస్‌పాత్ర, రెవ.డా.దయాపాత్ర, జాన్ వెస్లీ, బెంగళూరుకు చెందిన రెవ.పీడీ ఇమ్మానుయేలు, పాస్టర్ ఎలీషా తదితరులు చంద్రమ్మ సేవలను కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ శాఖ అదనపు కార్యదర్శి జీసీ నాగూర్, అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏబీటీఎఫ్) అధ్యక్షులు ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి, ఉపాధ్యక్షులు డా.సీఎం కిషోర్, ప్రధాన కార్యదర్శి ఆర్.నందగోపాల్, తమిళనాడు నాయుడు సంఘం అధ్యక్షులు, కాంగ్రెస్ ప్రముఖులు విల్లివాక్కం టి.సురేష్, హైకోర్టు న్యాయవాది దామోదరన్, టామ్స్ అధ్యక్షుడు నేలటూరి విజయకుమార్, మాజీ ఐఏఎస్ అధికారి గోవిందరాజన్, పుల్లాపురం ఆదిఆంధ్ర సేవా సంఘం అధ్యక్షుడు ఇరకట్ల నాగభూషణం, కార్యదర్శి కె.కుమార్, ఎమ్మార్పీఎస్ తమిళనాడు విభాగం అధ్యక్షుడు లోకేష్‌కుమార్ సహా నగరంలోని తెలుగు సంఘాలు, ఆదిఆంధ్ర అరుంధతీయ సంఘాల నిర్వాహకులు చంద్రమ్మ మృతదేహానికి పూలదండలు వేసి అంజలి ఘటించారు. తల్లిని కోల్పోయిన గొల్లపల్లి ఇశ్రాయేలు కుటుంబాన్ని ఓదార్చి ప్రగాఢ సంతాపం తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు కీల్పాక్కం క్రైస్తవ శ్మశానవాటికలో చంద్రమ్మ భౌతికకాయానికి అంత్యక్రియలు ముగిశాయి.


గొల్లపల్లి చంద్రమ్మ (ఫైల్ ఫొటో)

దాసం కోటేశ్వరరావు కన్నుమూత

ప్యారీస్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నై కొడుంగైయూర్ సమీపంలోని సీతారామనగర్ తెలుగు సంక్షేమ సంఘం వ్యవస్థాపకుల్లో ఒకరు, సంఘ సేవకుడు దాసం కోటేశ్వరరావు (71) అనారోగ్యం కారణంగా శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందారు. ఆయనకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. సంఘం తరఫున నిర్వహించే సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొంటూ ఎంతో సహకరించేవారని, ఆయన మృతి తీరని లోటని సంఘ నిర్వాహకులు పేర్కొన్నారు. కోటేశ్వరరావు అంత్యక్రియలు శనివారం ఉదయం 11 గంటలకు సీతారామనగర్‌లో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


కోటేశ్వరరావు (ఫైల్‌ఫొటో)

గుట్కా విక్రయించిన హిజ్రాల అరెస్ట్

ప్యారీస్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడులోని హోల్‌సేల్ మార్కెట్ ప్రాంగణంలో గుట్కా, హాన్స్, కూల్ లిప్ తదితర పొగాకు వస్తువులు విక్రయించిన ఇద్దరు హిజ్రాలను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం కోయంబేడు ప్రాంతంలో పోలీసులు తనిఖీ చేసి మార్కెట్ వెళ్లే దారిలో ఉన్న ఓ బడ్డీ కొట్టులో వ్యాపారం చేస్తున్న ఇద్దరు హిజ్రాలను అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించారు. కోయంబేడు న్యూ కాలనీకి చెందిన ఏంజెల్ (34), గోపిక (39) అనే వీరు చట్టవిరుద్ధంగా విక్రయించేందుకు 1.5 కిలోల పొగాకు వస్తువులు దుకాణంలో దాచారని గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు, ఇద్దరు హిజ్రాలను అరెస్ట్ చేశారు.

టంగ్‌స్టన్‌పై డీఎంకే దుష్ప్రచారం

● కేంద్ర మంత్రి మురుగన్

పుదుచ్చేరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): టంగ్‌స్టన్ ప్రాజెక్టుపై డీఎంకే రాజకీయ దుష్ప్రచారం చేసిందని కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ ఆరోపించారు. పుదుచ్చేరి విశ్వవిద్యాలయంలోని జరిగిన అంతర్జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, టంగ్‌స్టన్ సొరంగం తవ్వకం పనులపై డీఎంకే ప్రజలను మోసం చేసిందన్నారు. ఈ సొరంగం తవ్వకం పనులు 2017 నుంచి జరుగుతున్నా కానీ, డీఎంకే నేతలు రాజకీయ దుష్ప్రచారం చేశారని ఆరోపించారు. 2021లో డీఎంకే ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఈ పథకానికి ఎలాంటి వ్యతిరేకత లేదన్నారు. కానీ, స్థానిక గ్రామాల ప్రజలు ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆందోళన చేసిన తర్వాతే ప్రభుత్వం మేల్కొని, ఈ ప్రాజెక్టును వ్యతిరేకించడం ప్రారంభించిందని మంత్రి మురుగన్ పేర్కొన్నారు.

సంగీత దర్శకుడు డి.ఇమాన్ అవయవదానం

అడయార్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంగీత దర్శకుడు డి.ఇమాన్ తన పుట్టిన రోజును పురస్కరించుకుని అవయవదానం చేశారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులను కలిసి తన పేరు రిజిస్టర్ చేయించి, ప్రమాణ పత్రాన్ని శుక్రవారం సమర్పించారు. ఆయన మరణాంతరం నేత్రాలు, కిడ్నీ, గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, చర్మంతో సహా ఇతర అవయవాలను దానం చేస్తున్నట్టు ప్రమాణ పత్రంపై సంతకం చేసిన తర్వాత ఆయనకు ఆరోగ్య శాఖ ఒక గుర్తింపు కార్డు కూడా అందజేసింది. ఇది ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. కాగా, కోలీవుడ్‌లో ప్రముఖ సంగీత దర్శకుల్లో ఒకరైన డి.ఇమాన్ వరుస చిత్రాలకు సంగీత స్వరాలు సమకూర్చుతూ ఎంతో బిజీగా ఉన్నారు. అలాగే, తన బర్త్‌డేను పురస్కరించుకుని పలువురు అనాథలకు వివిధ రకాలైన సహాయాలను కూడా ఆయన అందజేశారు.


గుర్తింపు కార్డు స్వీకరిస్తున్న డి.ఇమాన్

అన్నావర్సిటీలో సందర్శకులకు కొత్త నిబంధనలు

అడయార్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండీలోని అన్నా విశ్వవిద్యాలయంలో త్వరలో సందర్శకుల ప్రవేశానికి కొత్త నిబంధనలను అమలు చేయనున్నారు. ఇటీవల ఈ వర్శిటీలో ఇంజనీరింగ్ విద్యార్థినిపై లైంగికదాడి జరిగింది. ఆ తర్వాత వర్సిటీలో భద్రత కట్టుదిట్టం చేశారు. బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు గుర్తింపు కార్డుల ధరించాలన్న నిబంధన విధించారు. ఈ నేపథ్యంలో మరికొన్ని నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ముఖ్యంగా వ్యక్తిగత పనుల మీద వచ్చే వారికి ప్రత్యేకంగా పాస్‌లు మంజూరు చేయనున్నారు. ఈ పాస్‌ను తిరిగి వెళ్ళే సమయంలో సెక్యూరిటీకి విధిగా అప్పగించాల్సి ఉంటుంది. వర్శిటీలో జరిగే నిర్మాణ పనుల్లో పాల్గొనే కార్మికులు ఇకపై రాత్రి పూట వర్శిటీలో ఉండకుండా నిషేధం విధించారు. ఇలా అనేక నిబంధనలను తీసుకుని రానున్నారు.

సీమాన్‌పై 4 సెక్షన్ల కింద కేసు నమోదు

అడయార్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నామ్ తమిళర్ కట్చి కన్వీనర్, సినీ దర్శకుడు సీమాన్‌పై నీలాంగరై పోలీసులు నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇటీవల ద్రావిడ నేత పెరియార్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా పెను దుమారాన్నే రేపాయి. సీమాన్ వ్యాఖ్యలను పలు రాజకీయ పార్టీల నేతలు ముక్తకంఠంతో ఖండించారు. పలు పార్టీల కార్యకర్తలు, నేతలు నీలాంగరైలోని సీమాన్ ఇంటిని ముట్టడించి ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో నీలాంగరై పోలీసులు... సీమాన్‌పై 4 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

నటుడు జయశీలన్ మృతి


అడయార్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కోలీవుడ్ నటుడు జయశీలన్ (40)కు కామెర్ల వ్యాధితో మృతి చెందారు. 'పుదుపేట', 'తెరి', 'విక్రమ్ వేదా', 'బిగిల్' వంటి అనేక చిత్రాల్లో నటించిన జయశీలన్ కామెర్ల వ్యాధి సోకడంతో స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి చికిత్స తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన శుక్రవారం తుదిశ్వాస విడిచారు. న్యూ వాషర్‌మెన్‌పేటలో నివశిస్తున్న ఆయన అవివాహితుడు. భౌతికకాయానికి బంధువులు శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆయన మృతిపట్ల పలువురు నటులు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.


జయశీలన్ (ఫైల్‌ఫొటో)



మిష్కిన్... ఓ నకిలీ మేధావి

● నటుడు అరుల్‌దాస్



సినీ దర్శకుడు మిష్కిన్‌పై నటుడు అరుల్ దాస్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మిష్కిన్ ఓ నకిలీ మేధావి అని ఆరోపించారు. హాలీవుడ్ చిత్రాల్లోని సన్నివేశాలను కాపీకొట్టి వాటితో సినిమాలను రూపొందించే నకిలీ మేధావి అని మండిపడ్డారు. పలు సినిమా ఆడియో, ట్రైలర్ వేడుకల్లో పాల్గొనే దర్శకుడు మిష్కిన్ ఇతర నటీనటులు, దర్శకులను సంస్కారహీనంగా మాట్లాడుతుంటారనే ప్రచారం ఉంది. దీనిపై అరుల్ దాస్ నగరంలో జరిగిన ఓ ఆడియో ఫంక్షన్‌లో పాల్గొని తీవ్రంగా ఖండించడంతో పాటు మిష్కిన్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేశారు. ప్రసాద్ ల్యాబ్‌లో అనేక సినీ కార్యక్రమాలు జరిగివుంటాయి. ప్రపంచంలోని గొప్ప గొప్ప కళాకారులు ఈ వేదికపై ప్రసంగించివుంటారు. వారంతా మిష్కిన్‌లా మాట్లాడివుండరు. ఎందుకంటే సభా మర్యాద అని ఒకటి ఉందనే విషయం వారికి బాగా తెలుసు. కానీ, మిష్కిన్‌కు ఇది తెలియదు. అందుకే నోటికొచ్చినట్టు మాట్లాడుతుంటారు. ఇటీవల కూడా 'అవన్‌దాన్ ఇళయరాజా' (అతనే ఇళయరాజా) అంటూ వ్యాఖ్యానించారు. ఇలా మాట్లాడేందుకు మిష్కిన్‌కు ఉన్న అర్హత ఏంటి? తమిళ చిత్రపరిశ్రమంలో మీరు అంత గొప్పనటులా? ఒక నకిలీ మేధావి. మిష్కిన్ మాట్లాడిన మాటలు, తీరు నాకు చాలా ఏమాత్రం నచ్చలేదు. మంచి చిత్రాలను తెరకెక్కించిన ఆయన దర్శకుడుగా గుర్తింపుపొందలేదు. ఇంగ్లీష్ చిత్రాల్లోని సన్నివేశాలు, కంటెంట్‌ను కాపీకొట్టిన నూడో మేధావి మిష్కిన్. ఇది నా మనోవేదన. మిష్కిన్ మాటతీరును తీవ్రంగా ఖండిస్తున్నాను' అని పేర్కొన్నారు.

పెను ప్రభావం చూపిన 'గజిని'

● నటి సునైనా

తన సినీ జీవితంపై సూర్య హీరోగా నటించిన 'గజిని' మూవీ తీవ్ర ప్రభావం చూపిందని హీరోయిన్ సునైనా అభిప్రాయపడ్డారు. 'కాదలిల్ విళుందేన్', 'మాసిలామణి', 'సమర్', 'లత్తి', 'నీర్ పరవై', 'వంశం' వంటి తమిళ చిత్రాల్లో నటించిన సునైనా.. తెలుగు, కన్నడం, మలయాళ భాషా చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆమె తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. 'కోలీవుడ్‌లోకి అడుగుపెట్టే సమయంలో నాకు తమిళ భాష ఏమాత్రం తెలియదు. అలాంటి సమయంలోనే అనేక తమిళ చిత్రాలను చూశాను. వీటిలో 'గజిని' మూవీ నాపై పెను ప్రభావం చూపింది. ఒక సినిమా స్టోరీలోని మూల కథాంశాన్ని గ్రహించేందుకు భాషతో సంబంధం లేదని గ్రహించాను. అందుకే 'గజిని' మూవీకి నా మనసులో ప్రత్యేకస్థానం ఉంది. తమిళ సినిమాలోని అందాన్ని ఈ మూవీ నాకు పరిచయం చేసింది. ఇపుడు ఈ విషయాలను వెల్లడించడానికి తాజాగా ఎక్స్ వేదికగా 'గజిని' మూవీలోని ఓ ముఖ్య సన్నివేశానికి సంబంధించిన ఫొటోను చూడటమే ప్రధాన కారణం' అని పేర్కొన్నారు.

'డీఎన్ఏ' స్టోరీ ఏంటి?



'డీఎన్ఏ'లో అధర్వ - నిమిషా

అధర్వ మురళి, నిమిషా జంటగా నటించిన కొత్త చిత్రం 'డీఎన్ఏ'. 'ఒరు నాల్ కూత్తు', 'మాన్‌స్టర్', 'ఫర్హానా' వంటి వైవిధ్యభరితమైన కథా చిత్రాలను రూపొందించిన నెల్సన్ వెంకటేశన్ దర్శకుడు. ఇతర పాత్రల్లో బాలాజీ శక్తివేల్, రమేష్ తిలక్, విజయ్ చంద్రశేఖర్, చేతన్, రిత్విక, కేపీ, సుబ్రహ్మణ శివ, కరుణాకరన్, 'పసంగ' శివకుమార్ తదితరులు నటించారు. ఒలింపియా మూవీస్ పతాకంపై జయంతి అంబేద్కర్ మూవీ నిర్మించారు. షూటింగ్ పూర్తి చేసుకుని, పోస్ట్‌ప్రొడక్షన్ నిర్మాణ పనులు జరుపుకుంటున్న ఈ చిత్ర విశేషాలను దర్శకుడు వివరిస్తూ, 'దివ్య, ఆనంద్ అనే రెండు ప్రధాన పాత్రల సైకాలజీ, జీవితమే ఈ చిత్ర కథ. దివ్యగా నిమిషా, ఆనంద్‌గా అధర్వ నటించారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించిన ఈ సినిమాకు ఐదుగురు సంగీత దర్శకులు పనిచేస్తున్నారు. నేపథ్య సంగీతం ప్రత్యేక బలంగా నిలుస్తుంది. అన్ని వర్గాల ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుంది. త్వరలోనే విడుదల చేస్తాం' అని పేర్కొన్నారు.

తమిళ చిత్రజ్యోతి



శంకర్



లింగుస్వామి



వెంకట్ ప్రభు

కోలీవుడ్‌లో టాప్ డైరెక్టర్లు టాలీవుడ్‌లో ..!?

పాన్ ఇండియా చిత్రాల హవా కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో ఒక భాషలో మంచిపేరు, గుర్తింపుపొందిన దర్శకులు మరో భాషలో తమ సత్తా చూపించలేకపోతున్నారు. ప్రధానంగా కోలీవుడ్ దర్శకులు ఏమాత్రం రాణించలేకపోతున్నారు. ఇటీవలికాలంలో పలువురు తెలుగు హీరోలు కొంతమంది తమిళ దర్శకుల చిత్రాల్లో నటించారు. ఈ దర్శకులకు తెలుగులో స్ట్రైట్ చిత్రాలు. ఇతర భాషల్లోకి కూడా డబ్బింగ్ చేసి భారీ అంచనాలతో రిలీజ్ చేశారు. ఈ మూవీలన్నీ బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్లుగా మిగిలాయి. ఈ జాబితాలో పలువురు ప్రముఖ తమిళ దర్శకుల ట్రాక్ రికార్డును పరిశీలిస్తే, 2017లో మహేష్ బాబు - ఏఆర్.మురుగదాస్ కాంబినేషన్‌లో వచ్చిన 'స్పైడర్' అటు తెలుగు, ఇటు తమిళంలో డిజాస్టర్‌గా నిలిచింది. మురుగదాస్‌కు ఇది తొలి స్ట్రైట్ చిత్రం కావడం గమనార్హం. 'అరిమా నంబి', 'ఇరుముగన్' వంటి చిత్రాలను తెరకెక్కించిన ఆనంద్ శంకర్.. తెలుగులో యువ నటుడు విజయ్ దేవరకొండాతో తమిళం, తెలుగు భాషల్లో 'నోటా' పేరుతో రూపొందించిన మూవీ అట్టర్‌ఫ్లాప్‌గా నిలిచింది. 'గీతాగోవిందం' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత విజయ్ దేవరకొండను నిరాశపరిచిన చిత్రంగా నిలిచిపోయింది. 'పురియాద పుదిర్', 'ఇస్పేట్ రాజావుమ్ ఇదయ రాణియుమ్' ఫేం రంజిత్ జయకొడి తెలుగులో సందీప్ కిషన్‌తో 'మైఖేల్' టైటిల్‌తో భారీ యాక్షన్ మూవీ రూపొందించగా, తీవ్ర నిరాశపరిచింది. తమిళంలో 'రన్', 'సండైకోళి' వంటి సూపర్‌హిట్ చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు ఎన్.లింగుస్వామి తెలుగు యువ హీరో రామ్‌తో కలిసి 'ది వారియర్' మూవీ చేశారు. ఈ హీరో చెన్నైలో పుట్టి పెరగడంతో కోలీవుడ్‌లో ఈ మూవీ ద్వారా అడుగుపెట్టాలని రామ్ ఎన్నో ఆశలు పెట్టుకోగా, ఈ మూవీ రెండు భాషల్లో డిజాస్టర్‌గా మిగిలిపోయింది. అదేవిధంగా మరో యువ హీరో నాగచైతన్య - వెంకట్ ప్రభు కాంబినేషన్‌లో తమిళం, తెలుగు భాషల్లో వచ్చిన 'కస్టడి' సినిమా కూడా రెండు భాషల్లో నిరాశపరిచింది. కోలీవుడ్ అగ్ర దర్శకుడు ఎస్.శంకర్ - టాలీవుడ్ స్టార్ హీరో రామ్ చరణ్ కాంబినేషన్‌లో పాన్ ఇండియా మూవీగా వచ్చిన 'గేమ్ ఛేంజర్' 2025 సంక్రాంతికి విడుదలై డిజాస్టర్ మూవీగా నిలిచింది. ఇది శంకర్‌కు తెలుగులో తొలి స్ట్రైట్ మూవీ కావడం గమనార్హం. అయితే, ఈ మూవీ వసూళ్ళపరంగా కూడా భారీ నష్టాలను మిగిల్చింది. దీంతో కోలీవుడ్ టాప్ దర్శకులతో చిత్రాలు చేసేందుకు టాలీవుడ్ హీరోలతో పాటు నిర్మాతలు కూడా వెనుకంజ వేస్తున్నారు.



గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వేలూరు జిల్లా కాట్పాడి రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపడుతున్న పోలీసులు



వేలూరు జలకంఠేశ్వరాలయంలో దేవారం కీర్తనలు ఆలపిస్తున్న చిన్నారులు

రిపబ్లిక్ డే వేడుకలకు 1.20 లక్షల మంది పోలీసులతో భద్రత

ముగిసిన రిహార్సల్స్

గరగాట్టం





నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

ప్యారీస్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ డే నేపథ్యంలో రాష్ట్ర పోలీసు శాఖ 1.20 లక్షల మంది పోలీసులతో రాష్ట్రవ్యాప్తంగా భద్రత పటిష్ఠం చేసింది. ఆదివారం జరిగే గణతంత్ర వేడుకల సందర్భంగా ఉగ్రవాద సంస్థలు, సంఘ విద్రోహుల వల్ల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు శాఖ నిఘా ముమ్మరం చేసింది. ముఖ్యంగా, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, మార్కెట్లు, ప్రార్థనా స్థలాలు, వాణిజ్య సముదాయ భవనాలు, పర్యాటక కేంద్రాల్లో ఇప్పటికే ప్రత్యేక పోలీసు బలగాలు మెటల్ డిటెక్టర్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్నారు. అదే విధంగా ప్రయాణికుల భద్రత దృష్టిలో ఉంచుకొని రైలు మార్గాలను కూడా ఆర్పీఎఫ్ బలగాలు రేయింబవళ్లూ తనిఖీ చేస్తున్నాయి. ముఖ్యంగా, జిల్లాల సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టుల వద్ద నిఘా వేసిన పోలీసులు, అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. రాష్ట్రంలోని చెన్నై, చెంగల్పట్టు సహా కోస్తా జిల్లాల్లో కోస్ట్‌గార్డ్, నేవీ దళాలు పడవలో గస్తీ తిరుగుతున్నారు. రాష్ట్రప్రభుత్వం తరఫున మెరీనా బీచ్ కామరాజర్ రోడ్డులో రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించేందుకు అన్ని హంగులతో వేదిక ముస్తాబైంది. ఈ ప్రాంతంలో రెండు వారాల నుంచి పోలీసులు షిఫ్టు పద్ధతిలో భద్రతా విధుల్లో పాల్గొంటున్నారు.

ముగిసిన రిహార్సల్స్...

మెరీనా బీచ్ కామరాజర్ రోడ్డులో రిపబ్లిక్ డే సందర్భంగా చేపట్టిన మూడు విడతల రిహార్సల్స్ శుక్రవారంతో ముగిసాయి. కార్మిక స్మారక స్థూపం వద్ద త్రివిధ దళాల కవాతు, నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు నృత్య ప్రదర్శన రిహార్సల్స్ చేశారు. సిలంబాట్టం, మయిలాట్టం, వయిలాట్టం, జానపద నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. ఈ రిహార్సల్ కారణంగా ఆ ప్రాంతంలో ఉదయం 6 నుంచి 8 గంటల వరకు వాహన రాకపోకలపై నిషేధం విధించారు.



వయిలాట్టం



నృత్యంలో ప్ల కార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు









త్రివిధ దళాలు, పోలీసుల కవాతు

ఉన్ని జ్వరంపై ఈపీఎస్ అవాస్తవాలు

మంత్రి ఎం.సుబ్రమణ్యం



అధునాతన ఎమ్మారై స్కానర్ ప్రారంభిస్తున్న మంత్రి సుబ్రమణ్యం

ప్యారీస్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రికెట్సియా అనే బాక్టీరియా ద్వారా గ్రామాలు, దట్టమైన అడవి ప్రాంతాల్లో వ్యాపిస్తున్న ఉన్ని జ్వరం గురించి ప్రజలను భయభ్రాంతులు చేసేలా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నాసాలై ఓమందూర్ ప్రభుత్వ ఎస్టేట్ ప్రాంగణంలోని తమిళనాడు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో రూ.6.60 కోట్లతో ఏర్పాటుచేసిన ఎమ్మారై స్కానర్ పరికరాన్ని శుక్రవారం మంత్రి సుబ్రమణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఈ ఆసుపత్రిలో 11 ఏళ్ల క్రితమే ప్రారంభించిన ఎమ్మారై స్కానర్ మంచి ఫలితాలు ఇస్తోందని, ప్రస్తుతం ఏర్పాటుచేసిన కొత్త పరికరం అతి తక్కువ సమయంలో ఎక్కువ మంది రోగులను స్కాన్ చేసి సత్వరం వెల్లడించే పరిజ్ఞానం ఉందని తెలిపారు. ఇలాంటి పరికరాలను విల్లుపురం, చెంగల్పట్టు జిల్లా ప్రభుత్వాస్పత్రుల్లో కూడా ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఆపరేషన్‌కు అవసరమైన పరికరాలు, ఆర్థోపెడిక్ ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలు, ఆధునిక వసతులు కల్పించడం వల్ల ఓమందూర్ ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై ప్రజల్లో నమ్మకం పెరిగిందన్నారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా తమిళనాడులో 30కి పైగా ప్రభుత్వాసుపత్రుల్లో ఎమ్మారై స్కాన్ సదుపాయం ఉందని తెలిపారు. దంత వైద్యులకు త్వరలోనే నిర్వహించనున్న కౌన్సెలింగ్ పారదర్శకంగా ఉంటుందని, ఇందులో సుమారు 34,000 మంది బదిలీ కానున్నారని తెలిపారు. రికెట్సియా అనే బాక్టీరియా ద్వారా కుగ్రామాలు, దట్టమైన చెట్లు పెరిగిన ప్రాంతాలున్న దిండుగల్ జిల్లాలో ఉన్ని జ్వరానికి గురైన 8 మంది బాధితుల్లో నలుగురు కోలుకున్నారని, ఈ జ్వరం గురించి పళనిస్వామి అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మంత్రి సుబ్రమణ్యం ఆరోపించారు.

'యునెస్కో'కు ఆపత్సహాయేశ్వరాలయం ఎంపిక

పెరంబూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా కుంభకోణం తాలూకా తుక్కాచ్చిఆపత్సహాయేశ్వరాలయం 1,300 సంవత్సరాల పురాతనమైనది. ఈ ఆలయంలో చివరగా ఎప్పుడు కుంభాభిషేకం నిర్వహించారు అనే విషయమై ఎలాంటి సమాచారం లేకపోగా, రూ.5 కోట్లతో ఆలయ ప్రాచీనత మారకుండా జీర్ణోద్ధరణ పనులు పూర్తిచేసి, 2023 నవంబరు 3న దేవాదాయశాఖ అధికారులు కుంభాభిషేకం నిర్వహించారు. ఈ నేపథ్యంలో, యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్, సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ (యునెస్కో) ఈ ఆలయాన్ని పురాతన ఆలయ సంరక్షణ, పునరుద్ధరణ కోసం 2024వ సంవత్సరానికి ప్రత్యేక అవార్డుకు ఎంపిక చేసిందని హిందూ దేవాదాయ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.



● నేతాజీ జయంతి వేడుకలు

వీఐటీ చెన్నైలో మేజర్ ముకుంద్ తల్లిదండ్రులకు సత్కారం

ప్యారీస్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వీఐటీ చెన్నై ప్రాంగణంలో స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అఖిల భారతీయ పూర్వ సైనిక్ సేవా పరిషత్ (ఏబీపీఎస్ఎస్‌పీ), వీఐటీ చెన్నై సంస్థలు సంయుక్తంగా గురువారం నేతాజీ జయంతి వేడుకలను 'పరాక్రమ దివస్'గా పాటించి, మేజర్ ముకుంద్ వరదరాజన్ తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. వీఐటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జీవీ సెల్వం సభాధ్యక్షులుగా వ్యవహరించి ప్రసంగిస్తూ... ఏడవ పెద్ద దేశంగా గుర్తింపు పొందిన మన దేశం 145 కోట్ల మందితో ప్రపంచంలో జనాభాలో కూడా అగ్రస్థానంలో ఉందన్నారు. సుమారు 40 లక్షల మందికి పైగా సైనికులు దేశ రక్షణకు అంకితభావంతో పనిచేస్తున్నారని, దేశ రక్షణలో అమరుడైన మేజర్ ముకుంద వరదరాజన్ మృతి ఆ కుటుంబానికే కాకుండా దేశానికే తీరనిలోటని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఆర్.వరదరాజన్, ఎం.ఇంద్రపాలన్, లెఫ్టినెంట్ కర్నల్ రాజన్‌గుప్త, ప్రొ ఛాన్సలర్ ప్రొఫెసర్ త్యాగరాజన్, అడిషినల్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీకే మనోహరన్, ప్రొఫెసర్ వి.రాజశేఖరన్ తదితరులతో కలసి జీవీ సెల్వం నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మేజర్ ముకుంద వరదరాజన్ తల్లిదండ్రులు వరదరాజన్-గీతలకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.



వరదరాజన్-గీత దంపతులను సత్కరిస్తున్న వీఐటీ వర్సిటీ ఉపాధ్యక్షులు జీవీ సెల్వం, ముఖ్యఅతిథులు

శాసనాలు, లిపి ప్రాధాన్యతపై ప్రదర్శన

● ఆసక్తిగా తిలకించిన విద్యార్థులు



ప్రదర్శన ప్రారంభించిన కేకే మహ్మద్

ప్యారీస్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పురాతన శిలాఫలకాలు, తెలుగు, తమిళం, కన్నడ, ఒరియా తదితర లిపి, సింధు నాగరికత విశిష్టతలపై ఏర్పాటుచేసిన ఈ ప్రదర్శన సందర్శకులను ఆలోచింపజేసింది. అశోకుడు కాలం నాటి రుంబిణి, లుంబిణి, ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా బట్టిప్రోలును పరిపాలించిన కుబిరక రాజు కాలం నాటి లిపి, శిలాఫలకం, ప్రకాశం జిల్లా అద్దంకిని పాలించిన చోళ రాజు చాణ్య కాలం నాటి తెలుగు-కన్నడ లిపి, పల్లవుల కాలం నాటి తాళపత్రాలు, మూడో శతాబ్దం నుంచి 16వ శతాబ్దం వరకు వాడుకలో ఉన్న తాళపత్రాలపై ప్రదర్శన భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. టి.నగర్‌లోని షాసన్ జైన్ మహిళా కళాశాల ఆర్ట్ అండ్ కల్చర్ విభాగం, ఏఎస్ఐ ఎపిగ్రఫీ సంస్థలు సంయుక్తంగా పురావస్తు శాఖ తవ్వకాల్లో బయల్పడిన శిలాఫలకాలు, సింధు నాగరికత ముద్రలు, రాజుల కాలం నాటి లిపి తదితరాలతో ఏర్పాటుచేసిన రెండు రోజుల ఫొటో ప్రదర్శన, సదస్సును గురువారం పద్మశ్రీ డా.మహమ్మద్ ప్రారంభించారు. తమిళనాడులోని విల్లుపురం జిల్లాలో తవ్వకాల్లో బయల్పడిన 5వ శతాబ్దం నాటి లిపి, శిలాఫలకాలు, కొన్ని పనిముట్లతో ప్రదర్శన ఏర్పాటుచేయడంతో పాటు, వాటి విశిష్టత గురించి ఏర్పాటుచేసిన రెండు రోజుల సదస్సు శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ అడిషినల్ డైరెక్టర్ జనరల్ డా.ఆలోక్ త్రిపాఠి, ఏఎస్ఐ మాజీ సూపరింటెండెంట్ సత్యమూర్తి, ఏఎస్ఐ ఎపిగ్రఫీ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, డా.రమాదేవి శేఖర్, పీటీ నాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.





తిలకిస్తున్న విద్యార్థినులు - శాసనాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న నాగరాజన్